వరికి బోనస్.. బోగస్!

- మద్దతు ధరకు బోనస్‌గా రూ. 500 ఇస్తామని కాంగ్రెస్ ప్రకటన
- సోనియా, రాహుల్‌గాంధీ, ప్రియాంకదీ అదే మాట
- ఇప్పుడేమో అదెలా కుదురుతుందన్న కిసాన్‌సెల్ జాతీయ అధ్యక్షుడు
- మార్కెట్ ధర ఎక్కువుంటే బోనస్ ఇవ్వబోమని స్పష్టీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిలో ఒకదానికి మంగళం పాడేందుకు ప్రయత్నిస్తున్నది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు వంద రోజులకు ముందే మరో హామీకి తిలోదకాలిచ్చే ప్రయత్నం మొదలుపెట్టింది. తాము అధికారంలోకి వస్తే వరికి మద్దతు ధరపై క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని, కాబట్టి ఎవరూ తొందరపడి వడ్లు అమ్ముకోవద్దని ప్రచారంలో ఊదరగొట్టింది. కాంగ్రెస్ మ్యానిఫెస్టో విడుదల సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఇదే విషయాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రచారసభల్లో సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీతో పాటు రేవంత్‌రెడ్డి, మల్లు భట్టివిక్రమార్క కూడా ఇదే హామీ ఇచ్చారు. మ్యానిఫెస్టోలోనూ ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పేర్కొన్నది. వరికి ప్రస్తుతం రూ. 2,183 మద్దతు ధర ఉన్నదని, తాము అధికారంలోకి వస్తే దానికి రూ. 500 బోనస్ కలిపి రూ. 2,683 ఇస్తామని స్పష్టంగా పేర్కొన్నది. కాంగ్రెస్ హామీతో రైతులెవరూ వడ్లు అమ్ముకోలేదు. ఇప్పుడేమో ఈ హామీకి తిలోదకాలివ్వాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు కాంగ్రెస్ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి మాటలను బట్టి అర్థమవుతున్నది. గాంధీభవన్‌లో మంగళవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో కలిసి కోదండరెడ్డి మీడియాతో మాట్లాడుతూ వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్‌పై నాలుక మడతేశారు. ప్రస్తుతం వరి మద్దతు ధర రూ. 2060 కాగా, బహిరంగ మార్కెట్‌లో రూ. 2,600 లభిస్తున్నదని, కాబట్టి రూ. 500 బోనస్ ఇవాల్సిన పనిలేదంటూ కొత్త వాదన తెరపైకి తీసుకొచ్చారు. కోదండరెడ్డి వ్యాఖ్యలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హామీ ప్రకారం బోనస్ చెల్లించాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. మాటమార్చి హామీని అటకెక్కించాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు.

‘కాళేశ్వరం’పై అదే కుట్రల రాజకీయం

- విఫల ప్రాజెక్టుగా చూపేందుకు సర్కార్ విఫల యత్నం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడిగడ్డ పర్యటన
- సమీక్ష పేరిట హడావుడి.. పరస్పర విరుద్ధమైన నివేదికలు
- ఇంకా ఇన్వెస్టిగేషన్ కొనసాగుతున్నది: ఇరిగేషన్‌శాఖ
- మెయింటెనెన్స్ లోపం వల్లే నష్టం అన్న విజిలెన్స్ డీజీ
- ప్రతిపక్ష పార్టీ తరహాలోనే సీఎం అడ్డగోలు విమర్శలు..
- మేడిగడ్డలో కాంగ్రెస్ నేతల మెగా హంగామా

వరంగల్/జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ)/మహదేవపూర్/కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టుపై రీడిజైన్, నిర్మాణం, నిర్వహణ, ఆయకట్టు కల్పనపై కాంగ్రెస్ నేతలు మరోమారు రాజకీయం చేసేందుకు ప్రయత్నించారు. మేడిగడ్డ బరాజ్‌ను మహా హంగామాకు వేదికగా మార్చుకున్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పలువురు మంత్రులు, కాంగ్రెస్, ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీపీఐ ఎమ్మెల్యే మేడిగడ్డను సందర్శించారు. ప్రాజెక్టుపై ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన అనంతరం మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు మరోసారి కేసీఆర్ ప్రభుత్వంపై తమ అక్కసును వెళ్లగక్కారు. కాళేశ్వరం ప్రాజెక్టును విఫల ప్రాజెక్టుగా చూపేందుకు మరోసారి ప్రయత్నించారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ద్వారా కోటి ఎకరాలకు సాగునీళ్లిచ్చామని మాజీ సీఎం కేసీఆర్ చెప్పింది పచ్చి అబద్ధమని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణానికి ఇప్పటివరకు రూ.97 వేల కోట్లు ఖర్చయ్యిందని, కానీ లక్ష ఎకరాలకు కూడా నీరివ్వలేదని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో సమస్య ఉన్నదని అధికారులు ఎల్ అండ్ టీ సంస్థకు లేఖ రాసినా అది స్పందించలేదని చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారంలో ఎక్కడా నీళ్లు స్టోరేజీ చేసే పరిస్థితి లేదని చెప్పారు. గత ఐదేండ్లలో 160 టీఎంసీలు కూడా ఎత్తిపోయలేదని అన్నారు. కేసీఆర్ వ్యూహాత్మకంగా కాంగ్రెస్‌పై ఎదురుదాడి చేస్తున్నారని, ఆయన అసెంబ్లీకి వచ్చి సలహాలివ్వాలని సూచించారు. కేఆర్‌ఎంబీపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని అసెంబ్లీకి వచ్చి డిమాండ్ చేయాలని అన్నారు. ఇరిగేషన్‌పై తాము శ్వేతపత్రం విడుదల చేస్తామని, దానిపై చర్చకు రావాలని కోరారు. కృష్ణా నది నీళ్లపై కేంద్రానికి అధికారం అప్పగించింది కేసీఆర్ అని ఆరోపించారు. బీజేపీ నాయకులు కేసీఆర్‌ను కాపాడటానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. ప్రాజెక్టులపై తాము జ్యూడీషియల్ విచారణను కోరుతుంటే బీజేపీ మాత్రం కేంద్రానికి అప్పగించాలని అంటున్నదని చెప్పారు. కేసీఆర్‌ను కాపాడటానికే బీజేపీ ఎమ్మెల్యేలు తమతోపాటు మేడిగడ్డకు రాలేదని అన్నారు.

కేసీఆర్ ప్రసంగం అయ్యేవరకు ఆగి..

బరాజ్ సందర్శన అనంతరం ఎమ్మెల్యేలు, మంత్రులు వేదికపైకి రాగా సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం తన వాహనంలోకి వెళ్లారు. నల్లగొండలో మాజీ సీఎం కేసీఆర్ ప్రసంగం అయిపోయిన అనంతరం ఆయన వేదికపైకి చేరుకున్నారు. ఇంతకుముందే మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలతో మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు గురించి పూర్తి స్థాయిలో సమావేశం నిర్వహించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ విన్నారు. మరోమారు సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జి ఈఎన్సీ సుధాకర్‌రెడ్డితో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇప్పించారు. అలాగే విజిలెన్స్ డీజీ రాజీవ్ రంజన్ బరాజ్ పరిస్థితిపై విచారణకు సంబంధించి మరో ప్రజంటేషన్ ఇచ్చారు. సుమారు రాత్రి 7 గంటల వరకు సమావేశం కొనసాగింది. సమావేశానికి మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు డుమ్మా కొట్టారు.

సాగునీటి ప్రాజెక్ట్‌లు ఆధునిక దేవాలయాలు

సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని పెద్దలు చెప్పారని సీఎం రేవంత్ అన్నారు. దేవాలయాలు ఎంత పవిత్రమైనవో సాగునీటి ప్రాజెక్టులు కూడా అంతే పవిత్రమైనవని చెప్పారు. మేడిగడ్డకు బయలుదేరడానికి ముందు సీఎం రేవంత్ అసెంబ్లీలో మాట్లాడారు. తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేసిందని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఏం జరిగిందో ఎవరికీ తెలియదని, కొంతమంది సీనియర్లు ఉన్నా.. వారికి పూర్తి అవగాహన ఉందో లేదో తనకు తెలియదని చెప్పారు. అందుకే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బ్యారేజీ సందర్శనకు రావాలని కోరామని అన్నారు. వాస్తవ పరిస్థితులను ప్రజల ముందుంచేందుకే అన్ని పార్టీలను ఆహ్వానించామని చెప్పారు.

అడ్డగోలు ఆరోపణలే..

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రీడిజైన్ ఎందుకు చేయాల్సి వచ్చిందో విన్న తరువాత కూడా గ్రావిటీ ప్రాజెక్టును కేసీఆర్ నిర్వీర్యం చేశారని, డబ్బంతా వృథా చేశారంటూ ఇష్టారీతిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ విరుచుకుపడ్డారు తప్ప ఇతర అంశాల జోలికి వెళ్లలేదు. ప్రాజెక్టుపై, కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగడమేతప్ప నిర్దిష్ట కారణాలు వెల్లడించలేదు. ప్రాజెక్టు అప్పులపై అధికారులు ఒకటి చెబితే వీరు తమ వ్యక్తిగత వాదనలను వినిపించారు. నిర్మాణ వ్యయం, ప్రాజెక్టు నిర్వహణ తీరు, కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైన్, బరాజ్ కుంగుబాటు, పునరుద్ధరణ తదితర అన్ని అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలన్నీ వారి అవగాహన రాహిత్యాన్ని బయటపెట్టాయి. ప్రాజెక్టుపై ఇప్పటివరకు 97వేల కోట్లకు పైగా ఖర్చుచేశారని రేవంత్, ఉత్తమ్‌లు చెప్పగా, అధికారులు 94వేల కోట్లు ఖర్చయిందని వెల్లడించడం గమనార్హం. సూటిగా చెప్పాలంటే రాజకీయ ప్రయోజనాల కోసమే మేడిగడ్డ సందర్శన పెట్టారని తేలిపోయింది. సమావేశం ఆద్యంతం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని బదునాం చేసే కోణంలోనే సీఎం అధికారులతో అడిగి మరీ సమాధానాలు చెప్పించుకున్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా చివరికి ఎటూ తేల్చకుండా వెళ్లిపోయారు. బరాజ్‌ను రిపేరు చేయిస్తారా.. మొత్తానికే వదిలేస్తారా.. అసలు టెక్నికల్ విచారణ ఎందుకు ప్రారంభం కావడం లేదు.. ఎల్ అండ్ టీతో పనులు చేయిస్తారా?.. అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. ఎన్‌డీఎస్‌ఏ విచారణ అనంతరం నిర్ణయం తీసుకుంటాం.. అవసరమైతే తుమ్మిడిహట్టి నిర్మిస్తాం అంటూ దాటవేస్తూ వెళ్లిపోయారు.

కాంగ్రెస్ హయాంలో 38వేల కోట్లతో ప్రారంభించాం : ఉత్తమ్

కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ హయాంలో రూ.38వేల కోట్లతో ప్రారంభించామని ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. మేడిగడ్డ వద్ద ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ లీడిజైన్ పేరుతో రూ.97వేల కోట్లు ఖర్చు పెట్టి కట్టారని తెలిపారు. ఇందులో భారీ కుంభకోణం జరిగిందని, దీనిపై విచారణ చేసి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. మేడిగడ్డ ప్రాజెక్టును తప్పుగా డిజైన్ చేశారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మోతాదుకు మించిన నీటిని నిల్వచేసి ప్రాజెక్టును నాశనం చేశారని విమర్శించారు.

పరస్పర విరుద్ధమైన నివేదికలు

బరాజ్ కుంగుబాటు ఘటనపై చేపట్టిన విచారణ అంశాలను విజిలెన్స్ డీజీ రాజీవ్‌రతన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు బరాజ్ కుంగుబాటునకు ఇంకా కారణాలు పూర్తిగా తెలియవని, ఇన్వెస్టిగేషన్ కొనసాగుతున్నదని, మరో 4-5రోజుల్లో ఒక స్పష్టత వచ్చే అవకాముందని తెలపగా, అందుకు పూర్తి విరుద్ధంగా విజిలెన్స్ అధికారులు తమ నివేదికను సమర్పించారు. విజిలెన్స్ డీజీ రంజన్ అవినీతి అక్రమాలపై కాకుండా బరాజ్‌లోని టెక్నికల్ విషయాలపై ఇంజినీర్‌లా స్క్రీన్‌పై ప్రజంటేషన్ ఇవ్వడం ఇంజినీర్లను అసహనానికి గురిచేసింది. నాణ్యతా లోపం, డిజైన్ లోపం వల్లే బరాజ్ కుంగుబాటునకు గురైందని విజిలెన్స్ అధికారులు వెల్లడించారు.ఇన్వెస్టిగేషన్ ఇంకా పూర్తి కాకముందే విజిలెన్స్ అధికారులు ఏ ప్రాతిపాదిక లోపాలను తేల్చారన్నది తెలియని పరిస్థితి. వాటిని ఆధారంగా చేసుకొని ప్రతిపక్షపార్టీ తరహాలోనే రొడ్డకొట్టుడు ఆరోపణలకు కాంగ్రెస్ ప్రభుత్వం దిగింది. కుంగుబాటుకు కారణాలపై ఇంకా స్పష్టత రాకుండానే, ఆ దిశగా పరీక్షలు చేపట్టకముందే అవినీతి, డిజైన్, తదితర లోపాలే కారణమంటూ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ధారించడం కొసమెరుపు.

ఉగాది నుంచి ఆసరా పెన్షన్ 4వేలు

- బీడీ కార్మికులందరికీ పింఛన్లు
- ఆశించిన పదవి రాలేదు
- ఊహించని పదవి వరించొచ్చు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 13: వచ్చే ఉగాది నుంచి ఆసరా పెన్షన్లు రూ.4 వేలు ఇస్తామని పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి తెలిపారు. కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ పెన్షన్లు అందిస్తామని పేర్కొన్నారు. మంగళవారం ఆయన జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు త్వరలోనే గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇస్తామని, వచ్చే నెల నుంచి అర్హులందరికీ రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు పథకాలు అమలు చేస్తామని ప్రకటించారు. 2014 తర్వాత ప్రావిడెంట్ ఫండ్ కట్ అవుతున్న వారందరికీ రూ.4 వేల పెన్షన్ ఇస్తామని చెప్పారు. తనకు ఆశించిన పదవి రాకున్నా రాబోయే రోజుల్లో ఊహించని పదవి వరించవచ్చని పేర్కొన్నారు.

- మాడల్ స్కూల్‌కు నీటి కష్టాలు

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దరియాపూర్ మాడల్ స్కూల్ వసతి గృహంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. మూడు రోజుల నుంచి బోరులోంచి నీళ్లు రావడం లేదని ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి తెలిపారు. గతంలో మార్చి మొదటి వారంలో ఈ సమస్య వచ్చేదని, ఇప్పుడు ముందే వచ్చిందని చెప్పారు. నీటి కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ పంచాయతీ స్పెషల్ అధికారి బెరి వేణుమాధవ్, కార్యదర్శి శ్యామ్‌కు తెలుపగా.. వారు మంగళవారం ట్యాంకర్ ద్వారా నీరు తెప్పించి సంపును నింపారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. -ముత్తారం

రాజకీయ లబ్ధికే రేవంత్ మేడిగడ్డ టూర్

- కృష్ణా జలాలు ఏపీకి వెళ్తే సర్కార్ ఏం చేస్తుంది?
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్

వరంగల్/హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 13: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ లబ్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ టూర్‌కు వెళ్లారని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం వరంగల్ పర్యటనకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ డ్యామేజీ వ్యవహారాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధికోసం వాడుకుంటున్నదని మండిపడ్డారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల డ్యామేజీపై సమగ్ర విచారణ జరిపించే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ఇంతకుముందే రాహుల్ గాంధీ, మంత్రులతో కలిసి మేడిగడ్డకు వెళ్లిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మళ్లీ ఎందుకు వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు.అధికారంలోకి రాకముందు సీబీఐ విచారణపై ప్రగల్భాలు పలికిన రేవంత్ ఇప్పుడు నోరెందుకు మెదపడం లేదని ప్రశ్నించారు.డ్యామ్ సేఫ్టీ అథారిటీ వివరాలు అడిగితే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని, నిపుణుల కమిటీ బృందంతో మేడిగడ్డ సందర్శనకు వస్తామంటే అనుమతి ఇవ్వడం లేదని ఆయన విమర్శించారు. ఎన్నికల వేళ అధికార, ప్రతిపక్ష పార్టీలు నాటకాలు అడుతున్నాయని మండిపడ్డారు. మేడిగడ్డ ప్రమాదంలో ఉన్నదని తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల కాలం వృథా చేసిందని అన్నారు. విజిలెన్స్ దర్యాప్తు అంటున్న రాష్ట్ర సర్కారు విజిలెన్స్ ఏం చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రాజెక్ట్‌లపై కేంద్రం పెత్తనం చేలాయిస్తున్నదని తప్పుడు ప్రచారం చేయడాన్ని మానుకోవాలని హితవు పలికారు. పోలీసుల పహారాలో ఏపీ కృష్ణా జలాలను తీసుకుపోతుంటే రెండు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. ఆంధ్ర రాష్ట్ర వ్యవహారంపై రాష్ట్ర సర్కారు వైఖరి ఏంటో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నదని ఎద్దేవా చేశారు. సమస్యను రాష్ట్రాలు పరిష్కరించుకుంటే కేంద్రం ఎందుకు జోక్యం చేసుకుంటుందని ప్రశ్నించారు. కేంద్రంపై నిందలు వేస్తూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయ ప్రాంగణంలో కల్యాణమండపం విశేషాలతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నెలాఖరులో వేయిస్తంభాల మండపాన్ని ప్రారంభిస్తాం

చారిత్రక వేయిస్తంభాల దేవాలయంలోని కల్యాణ మండపాన్ని వైభవంగా నిర్మిస్తున్నామని, ఈ నెలాఖరులో ఘనంగా పూజలు నిర్వహించి ప్రారంభిస్తామని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. మండపాన్ని పరిశీలించారు. అక్కడే కల్యాణ మండపం విశేషాలతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రామప్ప దేవాలయాన్ని రూ.60 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రూ.3 కోట్లతో వరంగల్ కోటలో సౌండ్ అండ్ లైట్స్ సిస్టమ్‌ను ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు. ములుగులో సమ్మక్క-సారక్క గిరిజన యూనివర్సిటీ మంజూరు చేశామని, త్వరలోనే ప్రధాని మోదీ ప్రారంభించనున్నట్టు చెప్పారు. తాత్కాలికంగా విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి ఈ ఏడాది కోర్సులను ప్రారంభిస్తామన్నారు.

మెడికల్ కాలేజీ హాస్టల్‌లో సీనియర్ల వేధింపులు

కళాశాల ప్రిన్సిపాల్‌కు జూనియర్ల లిఖితపూర్వక ఫిర్యాదు

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 13: గోదావరిఖనిలోని సింగరేణి వైద్య విజ్ఞాన సంస్థ హాస్టల్‌లో సీనియర్ విద్యార్థులు జూనియర్లను వేధించారు. సోమవారం రాత్రి హాస్టల్‌లో ఓ వైద్య విద్యార్థి తల వెంట్రుకలను సీనియర్లు కత్తిరించారు. దీంతో ఆ విద్యార్థి మంగళవారం ఇంటికెళ్లి జరిగిన ఘటనను తల్లిదండ్రులకు తెలుపడంతో విషయం బయటకు వచ్చింది. జూనియర్ విద్యార్థులందరూ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన ప్రిన్సిపాల్.. విచారణకు కమిటీని ఏర్పాటు చేయడంతోపాటు బాధ్యులైన విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపిస్తామని చెప్పారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఈ క్రమంలోనే మెడికల్ కాలేజీలో వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై అవగాహన కల్పించినట్టు చెప్పారు.

రైతులకు నీళ్లెప్పుడిస్తరు?

మేడిగడ్డ బరాజ్ మరమ్మతులు ఎప్పుడు చేస్తరు?

బాధ్యులపై, ఎల్‌అండ్‌టీపై చర్యలు తీసుకుంటారా?

సీఎం రేవంత్‌రెడ్డికి మీడియా ప్రతినిధుల ప్రశ్నలు

నీళ్లు నమిలిన ముఖ్యమంత్రి, సహచర మంత్రులు

అన్నింటికీ ‘చర్చించి చెబుతా’అంటూ దాటవేత

ఇంగ్లిష్ మీడియా ప్రశ్నలకు రేవంత్ బిత్తరముఖం

మైక్‌ను ఉత్తమ్‌కుమార్‌కు ఇచ్చి తప్పించుకొన్న సీఎం

జాతీయ మీడియా ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక మైక్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్/వరంగల్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బరాజ్ సందర్శనకు మంగళవారం వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాగునీటి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు సాగునీటి విషయాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తటపటాయించారు. దాదాపు అన్ని ప్రశ్నలకూ అయోమయంలో పడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పంటలకు ఎప్పటి నుంచి సాగునీరిస్తారని, బరాజ్ 20వ పిల్లర్ మరమ్మతులు ఎప్పటిలోగా పూర్తిచేస్తారు? అని.. ఇలా జర్నలిస్టులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. స్పష్టత ఇవ్వలేక దాటవేసే ప్రయత్నం చేశారు. ‘చర్చించి చెబుతాం.. నిపుణుల సూచన మేరకు నిర్ణయం తీసుకుంటాం..’ ఇవి రెండే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల నోట వచ్చిన సమాధానాలు. ఇక ఇంగ్లిష్ మీడియా ప్రతినిధులు ప్రశ్నలడిగిన ప్రతిసారీ సీఎం రేవంత్‌రెడ్డి తన చేతిలోని మైక్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌కు ఇచ్చి సమాధానాలివ్వాలని చెప్పి తప్పించుకున్నారు. మీడియా సమావేశంలో విలేకరుల ప్రశ్నలు, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానాలు ఇలా ఉన్నాయి.

- **మేడిగడ్డ బరాజ్ పిల్లర్ కుంగుబాటుకు కారణాలను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, రాష్ట్ర విచారణ అధికారులు ఇప్పటికే విశ్లేషించారు. బరాజ్ మరమ్మతులు ఎందుకు చేయడంలేదు?**

మేం సాంకేతిక నిపుణులం కాదు. పొలిటికల్ ఎగ్జిక్యూటివ్‌లం మాత్రమే. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, విజిలెన్స్ నివేదికలను పరిశీలించి, వారితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటాం.

- **వానకాలం దగ్గరపడుతున్నది.. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి వచ్చే సీజన్‌లో పంటలకు సాగునీరిస్తారా? మేడిగడ్డ బరాజ్ మరమ్మతులు ఎప్పుడు చేస్తారు?**

(దీనిపై సీఎం, మంత్రి సమాధానం చెప్పలేక ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు) సాంకేతిక అంశాలను పరిశీలించాక చెప్తాం.

- **మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లోని లోపాలకు బాధ్యులపై, ఎల్‌అండ్‌టీ సంస్థపై చర్యలు తీసుకుంటారా? జ్యూడీషియల్ విచారణ అని చెప్పారు కదా?**

అసెంబ్లీలో, ప్రభుత్వంతో చర్చించి దీనిపై చెబుతాం.

- **బరాజ్‌లోని లోపాల బాధ్యులపై చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణ కోరాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు కదా?**

వాళ్లు సీబీఐ విచారణ ఎందుకు అంటున్నారో అందరికీ తెలుసు. ఎలాంటి విచారణ అనేది చర్చించి చెబుతాం.

- **మేడిగడ్డపై జ్యూడీషియల్ విచారణకు సిట్టింగ్ జడ్జిని ఇవ్వలేమని, రిటైర్డ్ జడ్జితో నిర్వహించుకోవాలని హైకోర్టు చెప్పింది కదా?**

విచారణపై తగినవిధంగా నిర్ణయం తీసుకుంటాం.

- **మొదట జ్యూడీషియల్ విచారణ అన్నారు.. ఇప్పుడు విజిలెన్స్ విచారణ చేస్తున్నారు? అసలు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?**

నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే బాధ్యులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌తోపాటు రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగిస్తాం.

- **మన రాష్ట్రంలోని ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించవద్దని, ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని బీఆర్ఎస్ అడుగుతుంది కదా?**

ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌ని అసెంబ్లీకి వచ్చి అడగమనండి.

- **కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టులు కట్టే ప్రతిపాదనలు ఉన్నాయా?**

సాంకేతిక నిపుణుల సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

- **మేడిగడ్డకు మరమ్మతు చేసి నీళ్లిస్తారా? తమ్మడిహెట్టి బరాజ్ నిర్మిస్తారా?**

దీనిపైనా సాంకేతిక నిపుణుల సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

రోడ్డుపైకి వచ్చిన చిరుత

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 13 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలో రోడ్డుపై వెళ్తున్న వాహనదారులకు చిరుత కనిపించింది. ఖిల్లాఘణపురం మండలం సోలీపురం గ్రామానికి చెందిన నందకిశోర్, అల్లమాయిపల్లికి చెందిన యుగంధర్ సోమవారం రాత్రి వనపర్తి నుంచి కారులో వస్తున్నారు. ఖిల్లాఘణపురం సమీపంలోకి రాగానే పెద్దగుట్ట వైపు నుంచి రోడ్డు దాటుతూ చిరుత కనిపించింది. దీంతో వాహనదారులు భయపడి కారును రోడ్డుపై నిలిపి లోపలే కూర్చున్నారు. చిరుత వెళ్లిన తరువాత ఇంటికి చేరుకున్నారు. చిరుత సంచారం ఎక్కువైందని, అధికారులు ఎలాగైనా పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆడవేషంలో జీపీ కార్యదర్శి ప్రాంక